క్లుప్తంగా

సక్రమంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలకు అమలు చేస్తున్న పాడి పశువుల కొనుగోలు పథకాన్ని సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పశు వైద్య సిబ్బందికి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.కరుణాకర రావు సూచించారు. పాతపట్నం కోర్టు కూడలిలో ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ.. మేలు జాతి పశువులను కొనుగోలు చేయాలన్నారు. పాల ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులు పాడి రైతులందరికీ అందేలా చూడాలన్నారు. పశువైద్యులు బి.శ్రీవాణి, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ క్రీడాకారునికి ప్రోత్సాహకం



సతీష్ తండ్రికి నగదు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నరసన్నపేట: మండలంలోని కంబకాయకు చెందిన పాగోటి సతీష్ బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా, మండల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నందుకు అభినందిస్తూ స్థానిక లయన్స్ క్లబ్ రూ.15 వేలు ప్రోత్సాహకం అందజేసింది. ఈ మొత్తాన్ని సతీష్ తండ్రి వెంకటరమణకు శనివారం లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందించారు. ఈ ఏడాది నవంబర్‌లో థాయిలాండ్‌లో జరగనున్నట్లు అంతర్జాతీయ పోటీల్లో సతీష్ పాల్గొనున్నట్లు వెంకటరమణ తెలిపారు. పేద కుటుంబానికి చెందిన సతీష్ అంతర్జాతీయ వేదికలపై రాణిస్తున్నందుకు లయన్స్ క్లబ్ ప్రతినిధి సదాశివుని కృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తంగుడు రత్నాజీ, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి కె.రమేష్, ప్రతినిధులు రమణ సాహు, ఊణ్న రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైల్ పరిశీలన



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి వాణి

నరసన్నపేట: స్థానిక సబ్ జైల్‌ను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, స్థానిక కోర్టు సివిల్ జడ్జి ఎస్.వాణి శనివారం పరిశీలించారు. జైల్లో ఉన్న ఆరుగురు రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. జైల్లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, లేదా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం కావాలంటే కల్పిస్తామన్నారు. జైలు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రంగనాథన్‌కు ఘన నివాళి



రంగనాథన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామరాజు, తదితరులు

పాతపట్నం: గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన ఎస్.ఆర్.రంగనాథన్ ఆశయాలను కొనసాగించాలని రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, విశ్రాంత గ్రంథాలయాధికారి కాళ్ల రాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణలో రంగనాథన్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. రంగనాథన్ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి దాసుపురం సాయమ్మ, తూలుగు భుజంగరావు, జి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, జి.సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

25 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కొత్తూరు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కొత్తూరులో శనివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. 25 మంది రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాతలకు గుర్తింపు కార్డులను కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రసన్న అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ జిల్లా మేనేజర్ చైతన్య, మండల కన్వీనర్ పొగిరి రవి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. ఆరోగ్యం భద్రం



పాతపట్నంలోని యశోదనగర్‌లో రోడ్డుపై మురుగునీరు నిల్వ

- వాతావరణంలో మార్పులతో విషజ్వరాల వ్యాప్తి
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల దూరం
- వ్యాధుల నియంత్రణకు వైద్య, శానిటేషన్ విభాగం చర్యలు



పాతపట్నంలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

పాతపట్నం: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాలకు వీధులు, కాలువల్లో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది. జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్న, చిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల తాగునీరు కలుషితం అవుతున్నాయి. మరికొన్ని చోట్ల వర్షపు నీరు నిలిచి దోమలు పెరిగి పలురకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యాధుల కట్టడికి వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రజలు ఇళ్లల్లో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. టైఫాయిడ్, డెంగీ, మలేరియా, కామెర్లు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చు. ఇప్పటికే పంచాయతీ, శానిటరీ విభాగం వారు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో హైపో పిచికారీ చేసే ప్రక్రియలను ప్రారంభించారు.

నివారణా చర్యలు..

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, శానిటరీ, వైద్య సిబ్బంది కృషి చేయాల్సి ఉంది. వారానికి ఒకరోజు డ్రైడే పాటించేలా వార్డుల్లో, వీధుల్లో, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలి. సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాలి. జ్వరం వచ్చిన వారితో పాటు అనుమానితుల వద్ద కూడా రక్త నమూనాలు సేకరించాలి. అవసరమైతే ఉచితంగా మందులు పంపిణీ చేయాలి. కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడడంతోపాటు దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత శుభ్రత పాటించాలి.మల, మూత్ర విసర్జన అనంతరం సబ్బుతో చేతులను శుభ్రపరుచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. పనికిరాని సీసాలు, డబ్బాలు, కొబ్బరిచిప్పలు, టైర్లు, వాటర్ బాటిళ్లు, కూలర్లలో నీరు నిల్వ ఉంచరాదు. పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలం నేపథ్యంతో జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయి. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకపోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. రక్త పరీక్షలు చేసిన అనంతరం వ్యాధి నిర్ధారణ చేసి అవసరమైన మందులు అందిస్తారు. ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, యాంటీబయాటిక్స్, సెలైన్ బాటిళ్లు, రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

– డాక్టర్ కె.పూర్ణిమ, పీహెచ్‌సీ, గంగువాడ

కళలను ప్రోత్సహించాలి



పాతపట్నం: చెక్క భజన అధ్యక్షుడు ధర్మారావును సత్కరిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా

పాతపట్నం: సంప్రదాయాలను, కళలను, కళాకారులను కాపాడుకోవాలని జెడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పాతపట్నం నీలమణిదుర్గ ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. చిన్నారులు నిర్వహించిన శాస్త్రీయ నత్య ప్రదర్శనలు, తిడ్డిమి గ్రామస్తులు చేపట్టిన చెక్క భజనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పిండి వంటలు (ఫుడ్ స్టాల్) ప్రదర్శన చేపట్టారు. అనంతరం చెక్క భజన బృందం అధ్యక్షుడు శివ్వాల ధర్మారావును జెడ్పీ సీఈఓ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీఓ హెచ్.వి.రమణ, ఏఓ తిరుపతి పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ దేవేంద్ర ప్రసాద్, అమ్మవారి ఆలయం చైర్మన్ అక్కందర సన్యాసిరావు, పైల బాబ్జి, సైలాడ సతీష్, ఈఓ వాసుదేవరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

సంస్కృతిని భావితరాలకు అందజేయాలి

జలుమూరు: మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ టూరిజం దినోత్సవం సందర్భంగా శ్రీముఖలింగంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రసిద్ధ క్షేత్రాలు, వాటి చరిత్ర, కట్టడాలు, శిల్ప సంపదను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరిసాగు చేస్తున్న రైతులుకు జిల్లేడు ద్రావణంతోపాటు ఇతర కషాయాలు అందుబాటులో ఉంచాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ధనుంజయరావు తెలిపారు. కొత్తూరు రైతు సేవా కేంద్రంలో కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. ఇంతవరకు చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. ఏటీఎం పద్ధతిలో సాగు చేస్తున్న కూరగాయల పంటలను పరిశీలించారు. వరి పంటకు అవసరమైన సమయంలో వేయాల్సిన కషాయాలను రైతులుతో తయారు చేయించి, వాటిని పంటలపై పిచికారీ చేయించాలన్నారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ మునలయ్య, డీపీఎంటీ వెంకటేశ్వరరావు, ఎంటీ సూర్యనారాయణ, సురేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..

బూర్జ: మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. కొల్లివలసలో సైరిగాపు మురళి, తుడ్డలిలో శివ్వాల ఫకీరునాయుడు, వావాంలో గొలివె గణపతిరావు, మామిడివలసలో సాకేటి కిష్టమ్మ, నీలాదేవిపురంలో (నీలంపేట) కొయ్యాన సూర్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఉప్పపేట, మామిడివలస గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, నాయకులు సాకేటి శ్రీనివాసరావు, గొలివె గోపాలరావు, మజ్జి నర్సింగరావు, జల్లు ఆదినారాయణ, ఎస్.రామకృష్ణ, ఎస్.కొండలరావు, సైరిగాపు శివ, సీర వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కొల్లివలసలో సైరిగాపు మురళి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

నరకయాతన..



ఆమదాలవలస మండలంలోని దూసి నుంచి రాగోలు వైపు వెళ్లే రహదారిలో రాళ్లుతేలాయి. ఈ రహదారిలో ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. సుమారు 8 గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తున్నారు. ఈ రహదారిలో అధిక బరువుతో నాగావళినది నుంచి ఇసుక లారీలు ప్రయాణించడంతో గోతులు అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. – ఆమదాలవలస

ప్రమాదకర ప్రయాణం



ఆమదాలవలస నుంచి బత్తిలి వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. యువకులు ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రయాణిస్తున్నారు. ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రమాదకరమైన ప్రయాణం చేస్తున్నారు. శనివారం అధిక లోడ్‌తో బస్సు వెళ్తూ ఒక వైపు వాలింది. దీంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటివి నివారించాలని ఆర్టీసీ అధికారులను పలువురు కోరుతున్నారు. బస్సు సర్వీసులు అదనంగా నడపాలని కోరుతున్నారు. – ఆమదాలవలస

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన



జిల్లేడు ద్రావణాన్ని తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సారవకోట: వరిలో రసం పీల్చే పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ టి.రమణ సూచించారు. మండలంలోని కిరిడింగి గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. 10 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా వరి పంటపై పిచికారీ చేయడం వలన రసం పీల్చే పురుగులను నివారించవచ్చునన్నారు. జిల్లేడు ద్రావణం వలన పంటకు పోటాషియం సమృద్ధిగా అందుతుందని, గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామారావు, తిరుపతిరావు, కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ వంశీప్రియ

జలుమూరు: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీడీపీఓ సి.హెచ్.వంశీప్రియ అన్నారు. కరవంజ సెక్టార్‌లో శనివారం పోషణ్ మాసోత్సవాల సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ జుత్తు నేతాజీ, వైద్యురాలు లక్ష్మీప్రసన్న, పర్యవేక్షకులు సీతారత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

ఆమదాలవలస: ఆమదాలవలస అగ్నిమాపక కేంద్రం అధికారిగా (ఫైర్ ఎస్ఐ) సనపల శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు కొత్తూరు అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్, ఆపరేటర్‌గా విధులు నిర్వహించేవారు. ఉద్యోగోన్నతిపై అగ్నిమాపక అధికారిగా ఆమదాలవలసకు వచ్చారు. శ్రీనివాసరావును సిబ్బంది అభినందించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ఆమదాలవలస: ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుదామని ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ టి.రవి సూచించారు. స్థానిక పాలపోలమ్మ ఆలయ ఆవరణలో శనివారం సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేదానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: సూపర్ సిక్స్ పథకాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను చంద్రబాబు మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని ఎద్దేవా చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపుతున్నారని విమర్శించారు. ఏ పథకం కూడా సంపూర్ణంగా అమలు చేయడం లేదన్నారు. కానీ వారి అనుకూల మీడియాలో మాత్రం పతాక శీర్షికన కథనాలు రాయించుకుంటున్నారని అన్నారు. 16 వేల ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చి వేడుకలు నిర్వహించుకున్నారని.. లక్షలాది సచివాలయ ఉద్యోగాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఇచ్చిన విషయం మరిచిపోయారా అంటూ ప్రశ్నించారు. మహిళలను దారుణంగా వంచించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళలకు నెలకు ఆడబిడ్డ నిధి రూ.1500, నిరుద్యోగభృతి ఏమైందని ప్రశ్నించారు. అసలు ఉచిత గ్యాస్ ఎవరికి వస్తుందో, ఎవరికి రావడం లేదో తెలియడం లేదన్నారు. రైతుకు కనీస అవసరమైన ఎరువులు అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటు అన్నారు. విజయోత్సవాల పేరిట కార్యక్రమాలు నిర్వహించుకోవడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో కూటమికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

బాలకృష్ణ తక్షణమే క్షమాపణ చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు



ఆమదాలవలస: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, తక్షణమే క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు డిమాండ్ చేశారు. ఆమదాలవలసలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పట్ల బాలకృష్ణ బాధ్యతా రాహిత్యంగా మాట్లాడటం సభను అగౌరవపరచడమేనన్నారు. చట్ట సభలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. సినీ నటులను తాడేపల్లికి పిలిచి జగన్‌మోహన్‌రెడ్డి అవమానించారని చెప్పడం అవాస్తవమన్నారు. సొంత అన్నలా చిరంజీవిని వైఎస్ జగన్ చూసుకున్నారని, చిరంజీవిని చూసి బాలకృష్ణ ఓర్వలేకపోతున్నారని అన్నారు. సినీ పరిశ్రమ పట్ల వైఎస్ జగన్ స్పందించిన తీరును స్వయాన చిరంజీవి లేఖ రూపంలో తెలియజేశారన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు



బెనియా విజయలక్ష్మి, వెంకటరమణ

పాతపట్నం: అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మత్స్యకార మాజీ డైరెక్టర్ బెనియా విజయలక్ష్మి అన్నారు. తెంబూరులో విలేకర్లతో మాట్లాడారు. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు బాధ కలిగించేలా ఉన్నాయన్నారు. బాలకృష్ణకు మతిస్థిమితం లేదని, ఆయన అసెంబ్లీలో ఉండడం రాష్ట్ర ప్రజలకు మంచిది కాదన్నారు. తెంబూరు సర్పంచ్ బెనియా వెంకటరమణ ఉన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శామ్యూల్ అరుణ్ కుమార్

ఆమదాలవలస: క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఆమదాలవలస నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ జి.శామ్యూల్ అరుణ్ కుమార్ కోరారు. ఆమదాలవలస పట్టణంలో మూతపడిన సుగర్‌ఫ్యాక్టరీ సమీపంలో గల ముస్లిం కాలనీలో ఉన్న ప్రార్థన శిఖరం చర్చిలో శనివారం ఆమదాలవలస మున్సిపాలిటీ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశాన్ని నిర్వహించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆమదాలవలస పట్టణంలో సర్వే నంబర్ 73లో పూజారిపేట ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఉన్న క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు జి.డి.పాల్, చంద్రశేఖర్ పట్నాయక్, భీమపాలక జోసఫ్, క్రిస్టఫర్, రిటైర్డ్ పంచాయతీ సెక్రెటరీ సుభాకర్, పాస్టర్స్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

జయహో దుర్గాభవానీ..



నరసన్నపేట: విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయభవాని కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. లలితా త్రిపురసుందరి అవతారంలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు.

సారవకటలో..

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి దుర్గ అమ్మవారిని శనివారం అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులకు అన్న సంతర్పణ చేపట్టినట్లు అర్చకులు భాస్కర ఆచారి తెలిపారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలో దేవీ నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉర్లాంలో దుర్గాదేవి లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వీఎన్‌పురంలో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. నరసన్నపేట వేంకటేశ్వరాలయంలో స్వామిని విశేష అలంకరణ చేశారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండలంలోని పారాపురంలో ఆరో రోజు కాత్యాయని దేవిగా దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: మండలంలోని బొబ్బిలిపేట, చిట్టివలస గ్రామాల్లో దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సరుబుజ్జిలి: లలితాత్రిపుర సుందరిగా దుర్గాదేవి



ఆమదాలవలస: చిట్టివలసలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నరసన్నపేట: వీఎన్‌పురంలో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



ఆమదాలవలస: బొబ్బిలిపేటలో దేవి విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు



నరసన్నపేట: ఉర్లాం మార్కెట్ కూడలిలో లలితాదేవిగా దుర్గాదేవి



సారవకోట: అన్నపూర్ణదేవిగా నీలమణిదుర్గ



కొత్తూరు: కాత్యాయనిగా దుర్గాదేవి